క్లుప్తంగా

వైభవంగా సప్త కలశారాధన



పెదపట్నంలంకలో జరిగిన పూజల్లో పాల్గొన్న భక్త దంపతులు

మామిడికుదురు: పెదపట్నంలంక దేవి సెంటర్‌లో కొలువుదీరిన కోదండరామస్వామి వారి పాల శిలా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా రెండో రోజు మంగళవారం పలు ప్రత్యేక పూజలు జరిగాయి. ముత్యాల వీవీ లక్ష్మీ సత్యనారాయణ–శ్రీదేవి, ముత్యాల అమ్మిరాజు–కుమారి, ముత్యాల దుర్గాప్రసాద్–ఉషాదేవి దంపతులు ప్రధాన కర్తలుగా పాల్గొని పూజలు చేశారు. వేద మంత్రోచ్చారణల నడుమ వేద పండితులు పలు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బుధవారం ఉదయం 7.15 గంటలకు శ్రీహనుమత్ సీతారామ లక్ష్మణ సమేత కోదండ రామచంద్రస్వామి ప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

నేడు మూడు గ్రామాల్లో ప్రచారం

అంబాజీపేట: సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని మండలంలో పసుపల్లి, వక్కలంక, కముజువారిలంక గ్రామాల్లో ప్రచారాన్ని బుధవారం ఉదయం 7 గంటలకు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ అధ్యక్షులు, అనుబంధ కమిటీలు తదితరులంతా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు హాజరవుతున్నారన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న ఆర్డీవో సత్యనారాయణ తదితరులు

ఆత్రేయపురం: మండలంలోని ఆత్రేయపురం, ర్యాలి, మెర్లపాలెం గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను మంగళవారం తహసీల్దార్ ఎం.వెంకట రామయ్యతో కలసి ఎలక్టోరల్ అధికారి, కొత్తపేట రెవెన్యూ డివిజన్ అధికారి జీవీవీ సత్యనారాయణ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్, ఈటీఆర్డీ శ్రీనివాస్, ఎంఈఓ వరప్రసాద్, ఆర్ఐ భవాని, వీఆర్వోలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



గెద్దాడ రక్తదాన శిబిరంలో పాల్గొన్న ప్రతినిధులు

మామిడికుదురు: ఫ్యూచర్ ఇండియా ఫౌండేషన్–బ్రైట్ స్టోన్స్ ఆధ్వర్యంలో మంగళవారం గెద్దాడ గ్రామంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరం ద్వారా 20 మంది రక్తదానం చేశారు. అత్యవసర సేవల సమయంలో వినియోగించేందుకు ఈ రక్తాన్ని రాజోలు ఏరియా ఆస్పత్రికి అందించారు. కార్యక్రమంలో ఫ్యూచర్ ఇండియా ఫౌండేషన్ సరెళ్ల సావిత్రి, సరెళ్ల సతీష్, తేజ, శివ, కుమార్, సురేష్, వెంకట్, బ్రైట్ స్టోన్స్ సభ్యులు పాల్గొన్నారు.

హోం ఓటింగ్‌పై ప్రత్యేక దృష్టి

అంబాజీపేట: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడానికి హోం ఓటింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేయాలని తహసీల్దార్ జె.విమలకుమారి అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బూత్‌లెవెల్ అధికారలకు హోం ఓటింగ్, ఆబ్సెంట్ ఓటర్ల గుర్తింపు, తదుపరి కార్యాచరణపై మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విమలకుమారి మాట్లాడుతూ మండలంలో 85 ఏళ్ల పైబడిన ఓటర్లు 43, 40 శాతానికి పైబడి వైకల్యం ఉన్న ఓటర్లు 30 మందిని గుర్తించామన్నారు. వీరంతా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయవచ్చని, లేదంటే తమ ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు. పోలింగ్ కేంద్రానికి రాలేని వారు ఫారం–12డి ద్వారా బీఎల్ఓల నుంచి అంగీకార పత్రం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. దీనిపై బీఎల్వోలు, ఇతర అధికారులు ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయని వారి (ఆబ్సెంట్ ఓటర్లు)ని గుర్తించి వచ్చే ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎండీ ఇబ్రహీం, బీఎల్వోలు పాల్గొన్నారు.

కొత్తపేట కాంగ్రెస్ అభ్యర్థిగా 'రౌతు'

రావులపాలెం: కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా రౌతు కాశీను పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ప్రకటించినట్లు ఆయన తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం ఇడుపులపాయలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన అసెంబ్లీ అభ్యర్థుల పేర్లు ప్రకటించారన్నారు. కొత్తపేట నియోజకవర్గానికి ప్రముఖ ఆయుర్వేద డాక్టర్ రౌతు ఈశ్వరరావు (కాశీ) పేరు మొదటి లిస్టులోనే ప్రకటించడంతో రావులపాలెంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు.

ప్రతి చుక్కా.. ఒడిసిపట్టు ఎంచక్కా..



తూర్పు డెల్టా కాలువలో ప్రవహిస్తున్న సాగునీరు

- శివారు ప్రాంతాలకూ సాగునీటి సరఫరా
- రబీకి సాగునీటి సరఫరాపై అధికారుల ప్రత్యేక దృష్టి
- మూడు నియోజకవర్గాల్లో 53,396 ఎకరాల సాగు

ఆలమూరు: వరినాట్లు పూర్తైన నాటి నుంచి పంట చేతికందే వరకూ సాగునీటిని సక్రమంగా పంట పరిస్థితుల ఆధారంగా ప్రణాళికాబద్ధంగా అందించాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించింది. రబీ సాగు తుది దశకు చేరుకున్న తరుణంలో వరి పంటకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. రబీలో సాగు చేసిన ప్రతి ఎకరాకు సాగు నీటిని అందించాలన్న రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను వ్యవసాయ, ఇరిగేషన్ శాఖ అధికారులు సమర్థవంతంగా పాటిస్తున్నారు. ముందస్తు జాగ్రత్త చర్యగా రూపొందించుకున్న ప్రణాళిక మేరకు ఎప్పటికప్పుడు నీటి సరఫరాను పర్యవేక్షిస్తూ ప్రతి ఎకరాకు నీరందించే ఏర్పాట్లు చేస్తున్నారు. రబీ సాగు పంట ఆరంభంలోనే వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో దశల వారీగా సమావేశమై పక్కా ప్రణాళికను రూపొందించింది. సజావుగా నీటిని సరఫరా చేస్తుంది. రైతుల్లో అవగాహన కల్పిస్తూ నీటిని వినియోగించాల్సిన అవసరాన్ని క్షేత్రస్థాయికి వెళ్లి అధికారులు వివరిస్తున్నారు. ఈ నేపథ్యంలో క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల పరిధిలో సాగు నీటి సరఫరా తీరుతెన్నులపై ఈ కథనం..

మూడు నియోజకవర్గాల్లో సాగు ఇలా...

ఒక ఎకరా వరి సాగు కాలం మొత్తానికి 1,250.39 మిల్లీ మీటర్లు నీరు అవసరమవుతుంది. కొత్తపేట నియోజకవర్గంలో 57 గ్రామాల్లో 25635 ఎకరాలకు 3,20,53,747 మిల్లీమీటర్లు, పి.గన్నవరం నియోజకవర్గంలో 75 గ్రామాల్లో 19948 ఎకరాలకు 2,49,42,779, రాజోలు నియోజకవర్గంలోని 53 గ్రామాల్లో 7813 ఎకరాలకు గాను 97,69,297 మిల్లీమీటర్ల సాగునీరు అవసరమవుతుంది. ఈ మూడు నియోజకవర్గాల పరిధిలోని 182 గ్రామాల్లో 53,396 ఎకరాలకు 10,04,16,272 మిల్లీ మీటర్ల సాగు నీరు అవసరమవుతుంది.

సాగు సలహా మండళ్లు విరివిగా తోడ్పాటు

ప్రస్తుత ప్రభుత్వం రూపొందించిన వివిధ దశల్లోని సాగు సలహా మండళ్లు సాగు ప్రక్రియకు విరివిగా తోడ్పాటును అందిస్తున్నాయి. ఆర్‌బీకే స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సాగు సలహా మండళ్ల వరి రైతులను చైతన్యవంతం చేయడంలో ప్రధాన భూమిక పోషిస్తున్నారు. దీంతో స్థానిక రైతు సూచనలు, సలహాలు సైతం పై స్థాయిలో తీసుకునే నిర్ణయాల్లో భాగమవుతున్నాయి. ఆ మండళ్లలో రెవెన్యూ, జలవనరులు, వ్యవసాయ శాఖల భాగస్వామ్యం ఉండటంతో పటిష్టమైన నిర్ణయాలకు అవకాశం ఏర్పడుతుంది.

క్షేత్ర స్థాయిలో వరి సాగు నీటి అవసరం ఇలా...

మండలం	గ్రామాలు	సాగు విస్తీర్ణం	అవసరమైన నీరు (మిల్లీమీటర్లలో)
ఆలమూరు	18	9245	1,15,59,855
కొత్తపేట	10	6953	86,93,961
ఆత్రేయపురం	17	4806	60,11,825
రావులపాలెం	12	4631	57,90,556
పి.గన్నవరం	20	6100	76,27,379
మామిడికుదురు	18	2790	34,88, 588
అంబాజీపేట	16	2990	37,38,6666
అయినవిల్లి	21	8068	1,00,88,146
రాజోలు	16	4357	54,47,949
మలికిపురం	21	1627	20,34,384
సఖినేటిపల్లి	16	1829	22,86,963
11	182	53396	10,04,16,272

నీటి వినియోగంలో అవగాహన తప్పనిసరి



ఎగువ భూములున్న రైతులు ఎక్కువ నీటిని వినియోగిస్తుండటంతో పల్లపు రైతులకు సమస్య ఎదురవుతుంది. దీంతో వారి భూముల్లో దిగుబడి తగ్గే పరిస్థితులొస్తాయి. నేలలో పైరుకు తడి 75 శాతం వరకూ తగ్గిపోతే నీటి ఎద్దడి ఉంటుందంటారు. అలాగని అవసరం రాకుండా ముందస్తుగా నీరును పెట్టినా ప్రాణవాయువు దక్కక పంట దిగుబడి తగ్గిపోతుంది. నాట్లు వేసేటప్పుడు నీరు పలుచగానూ, మూన తిరిగిన రోజు నుంచి పైరు దుబ్బుచేయడం పూర్తయ్యే వరకూ 2 సెంటీమీటర్ల నీరు ఉంటే సరిపోతుంది. చిరుపొట్ట దశ నుంచి గింజ గట్టిపడే వరకూ 5 సెంటీ మీటర్ల నీరుండాలి. ఈనిక దశ, చిరుపొట్ట దశల్లో ఎట్టి పరిస్థితిలోనూ నీటి ఎద్దడి లేకుండా జాగ్రత్త వహించాలి. కోతకు పది రోజులు ముందుగా నీటిని నెమ్మదిగా తగ్గించాలి. నీరు ఎక్కువగా ఉంటే పైరు దుబ్బు బాగా చేయదు.

– కె.నాగేశ్వరరావు, ఏడీఏ, వ్యవసాయశాఖ సబ్ డివిజన్, ఆలమూరు

టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: గ్రామానికి చెందిన గొల్లపల్లి భాగ్యరావు ఆయన కుమారులు గొంతెలమ్మ గుడి సంఘం ప్రెసిడెంట్ గొల్లపల్లి రాజశేఖర్, గొల్లపల్లి అభిషేక్, లోకేష్, రాంబాబు పవర్, సురేష్, అనిల్, సురేంద్ర, పాల్, స్వరూప్, సూర్య, శివ, యాలంగి అజయ్, రాజు, సాయి, బాబు, నాని,తేజ, మధు, రాజేష్, సంజు, రాంసాయి, రాజు, ధనుష్, తేజ, పోతుమూడి శ్రీను, ఏడుకొండలు, అభిషేక్ తదితర 100 మంది కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారు మాట్లాడుతూ అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తూ, ఏ విధమైన భేదాలు చూడకుండా అర్హులైన ప్రజలందరికీ ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించిన జగన్ గెలుపుకు, నియోజకవర్గంలో దళితులను సొంత కుటుంబ సభ్యులుగా భావించే చిర్ల జగ్గిరెడ్డి గెలుపుకు కృషి చేస్తామన్నారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అందరి పార్టీ అని, పార్టీలో చేరిన వారికి భవిష్యత్తులో సముచిత స్థానం కల్పిస్తామని, పార్టీలో యువత భారీగా చేరడం శుభసూచకం అన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీలో చేరిన వారికి చిర్ల జగ్గిరెడ్డి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

అధికారంలోకి తీసుకువచ్చేందుకు శ్రమిస్తాం



ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని సత్కరిస్తున్న రాజీనామా చేసిన గ్రామ వలంటీర్లు

ఆలమూరు/రావులపాలెం: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో అహర్నిశలు శ్రమించి రెండో సారి వైఎస్ జగన్‌ను సీఎంగాను, కొత్తపేట ఎమ్మెల్యేగా నాలుగోసారి చిర్ల జగ్గిరెడ్డిని గెలిపించుకుంటామని మండలంలోని చెముడులంకలో ఇటీవల రాజీనామా చేసిన మాజీ వలంటీర్లు శపథం చేశారు. టీడీపీ చేస్తున్న కుటిల రాజకీయాలకు, పేదలపై అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా రాజీనామా చేసిన 28 మంది వలంటీర్లు మంగళవారం సర్పంచ్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో ర్యాలీగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి నివాసమైన గోపాలపురం వెళ్లారు. ప్రతిపక్ష పార్టీలు అవలంబిస్తున్న పక్షపాత వైఖరిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామాల్లో ఎల్లప్పుడూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ సంక్షేమ పథకాలను చేరవేస్తున్న గ్రామ వలంటీర్లపై నిరంతరం విషం కక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో నియోజవర్గంలో టీడీపీని ఓడించడమే ధ్యేయంగా పనిచేసి పార్టీని రికార్డు స్థాయి మెజారిటీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని పూలమాలతో ఘనంగా సత్కరించారు. గత నాలుగున్నరేళ్ల నుంచి ప్రజలకు సేవలను అందించే అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో, నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టడం ఖాయమని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అన్నారు. ప్రజలకు నిరంతరం సేవలను అందించిన గ్రామ వలంటీర్లను త్యాగం వృథా కాదని ఆయన హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ నాయకులు నామాల శ్రీనివాసు, దొండపాటి చంటి, అడబాల వీర్రాజు, తమ్మన హరికృష్ణ, దొండపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దళితులు మరింత చైతన్యవంతం కావాలి



నగరంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న దళిత చైతన్య వేదిక ప్రతినిధులు

మామిడికుదురు: దేశంలో సంభవిస్తున్న విపత్కర పరిస్థితులను అర్థం చేసుకుని దళితులు మరింత చైతన్యవంతులు కావాలని దళిత చైతన్య వేదిక పిలుపు నిచ్చింది. నగరం భారత్ నగర్‌లో మంగళవారం చైతన్య వేదిక సమన్వయకర్త బత్తుల జనార్దనరావు అధ్యక్షతన వేదిక కార్యవర్గ సమావేశం జరిగింది. చిలకపాటి శ్రీధర్‌ను వేదిక ఉపాధ్యక్షుడిగా, మందపాటి రాజేశ్వరరావును కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమిస్తూ పత్రాలను వేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ అందజేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారత రాజ్యాంగాన్ని మారుస్తామన్న బీజేపీని ఓడించాలని మురళీకృష్ణ పిలుపునిచ్చారు. రాజోలు కేంద్రంగా త్వరలో అన్ని గ్రామాల్లో జేఏసీ నేతలు పర్యటించి దళితులకు మార్గ నిర్దేశం చేస్తారన్నారు. సమావేశంలో వేదిక ప్రతినిధులు తెన్నేటి నాగేశ్వరరావు, చుట్టుగుళ్ల సత్యనారాయణ, బొడ్డపల్లి పుల్లయ్య, సరెళ్ల సురేష్, కోరుకొండ రాజా, కాకర విశ్వనాథం, కాకర్ల డేనియల్, కోరుకొండ రాజేష్‌కుమార్, గోగి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ స్ఫూర్తితో దూసుకుపోదాం



సమావేశంలో మాట్లాడుతున్న రాజోలు నియోజకవర్గ అభ్యర్థి గొల్లపల్లి

రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి

రాజోలు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలు చేసిన సంక్షేమ పథకాల స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో విజయం వైపు దూసుకుపోదామని రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మంగళవారం తాటిపాకలో గొల్లపల్లి సూర్యారావు నివాసగృహం వద్ద రాజోలు మండల బూత్ కమిటీ కన్వీనర్ల సమావేశం జరిగింది. మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజోలు అసెంబ్లీ అభ్యర్థి నియోజకవర్గ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు, అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి రాపాక వరప్రసాదరావులు ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రసంగించారు. గొల్లపల్లి మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు రాబోయే ఎన్నికల్లో మళ్లీ రెండోసారి జగన్‌మోహన్‌రెడ్డిని విజయపథంలో నిలపాలన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు సమన్యాయం చేశారన్నారు. అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ గెలుపే లక్ష్యంగా గ్రామాల్లోని బూత్ కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా కృషి చేయాలన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, జెడ్పీటీసీ మట్టా శైలజ, నాయకులు కేఎస్ఎన్ రాజు, పాటి శివకుమార్, కంచర్ల శేఖర్, తెన్నేటి కిషోర్, సూరిశెట్టి బాబి, ఎస్తేరు రాణి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను ఆశీర్వదించాలి



ఊడిమూడిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు

పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి

పి.గన్నవరం: పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం జగన్‌ను ప్రజలంతా ఆశీర్వదించాలని, జరుగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి తమను గెలిపించాలని పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. మండలంలోని ఊడిమూడి, ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, బూరుగులంక, అరిగెలవారిపేట గ్రామాల్లో మంగళవారం విప్పర్తి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రజలను కలుసుకున్నారు. జగన్ పాలనలో జరిగిన అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే జగన్‌ను మళ్లీ గెలిపించాలని కోరారు. మోసపూరిత వాగ్దానాలతో వస్తున్న ప్రతిపక్ష పార్టీలను నమ్మవద్దని విప్పర్తి అన్నారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న విప్పర్తికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, సర్పంచ్ దంగేటి అన్నవరం, సొసైటీ చైర్మన్ గిడ్డి రాంబాబు, నాయకులు సాధనాల రమేష్, పందిరి పూర్ణచంద్రరావు, కొల్లు రాంబాబు, సుబ్బారావు, అడ్డగళ్ల వెంకట సాయిరామ్, దొమ్మేటి వెంకట శివరామన్, మద్దుల వరలక్ష్మి, నేలపూడి స్టాలిన్‌బాబు, తోలేటి బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రజకులకు అండగా 'జగనన్న చేదోడు'



గొల్లపల్లిని కలసిన నియోజకవర్గ రజక సంఘ నాయకులు

రాజోలు: రజకులకు ప్రభుత్వం అమలు చేసిన జగనన్న చేదోడు పథకం ఎంతో అండగా నిలిచిందని రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. రాష్ట్ర వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గ్రంధం రవికుమార్ ఆధ్వర్యంలో రాజోలు నియోజకవర్గానికి చెందిన పలువురు రజక సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా గొల్లపల్లిని కలిశారు. సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ బీసీలకు అండగా నిలిచిన ఏకైన రాజకీయ పార్టీగా వైఎస్సార్ సీపీ కీర్తి గడించిందన్నారు. రాష్ట్రంలో 48 అసెంబ్లీ, 11 పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు అవకాశం కల్పించారన్నారు. ఉభయగోదావరి జిల్లాల్లో బీసీ వర్గాలకు అత్యధిక ప్రాధాన్యం కల్పించడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీసీ స్థానాలను విజయపథంలో నిలిపేందుకు కృషి చేయాలని కోరారు. రజక సంఘ నాయకులు గోగన్నమఠం శ్రీనివాసరావు, శీలం త్రిమూర్తులు, తలుపూరి కరుణాకర్‌రావు, మాగాపు నాగేంద్ర, గుమ్మడి ఏడుకొండలు, కోటిపల్లి శ్రీను, పాదలాడ శ్రీనివాసరావు, రామేశ్వరపు ప్రసాద్, గుడాల జాను తదితరులు పాల్గొన్నారు.

సేవలే ఉద్యోగస్తులకు గుర్తింపు

అల్లవరం: ఉద్యోగి తన జీవిత కాలంలో ప్రజలకు అందించిన సేవలే వారికి గుర్తింపునిస్తాయని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో గూడాల పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగ విరమణ చేసిన అడబాల రాజేశ్వరరావు ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజా దంపతులను దుశ్శాలువా, పూలమాలతో సత్కరించి ప్రశంసాపత్రం అందించారు.

భజన మందిర నిర్మాణానికి సహకరించాలి

అమలాపురం రూరల్: మండలంలోని జనుపల్లి గ్రామంలో ఇస్కాన్ జగన్నాథ స్వామి మందిర నిర్మాణానికి భక్తులు సహకరించాలని ఇస్కాన్ రాజమండ్రి చైర్మన్ శివానంద నిమయిదాస్ కోరారు. మట్టిని సేకరించి మెరక పనుల నిమిత్తం గ్రామ పెద్దలతో చర్చించామన్నారు. జయంతి ట్రావెల్స్ అధినేత సుబ్రహ్మణ్యం సహకరిస్తామని చెప్పారన్నారు. త్వరలోనే జగన్నాథ స్వామి భజన మందిరం, బ్రహ్మచారి ఆశ్రమం, వంటశాలలు వంటి నిర్మాణాలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ గణాల భారతి, రామాలయ కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు, ప్రభాకర్, సానబోయిన వీరభద్రరావు, శ్యామ్ సత్యధర్మదాస్ తదితరులు పాల్గొన్నారు.



ఇస్కాన్ స్థలాన్ని పరిశీలిస్తున్న శివానంద నిమయిదాస్

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మంగళవారం ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో జరిగిన రంజాన్ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన వైఎస్సార్ సీపీ కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి, అనంతరం అక్కడ ఇఫ్తార్ విందులో అందరికీ భోజనాలు వడ్డించి ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామ సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ

కొత్తపేట: ఈ నెల సామాజిక పింఛన్లను గ్రామ సచివాలయాల వద్ద సచివాలయాల సిబ్బంది పంపిణీ చేస్తారని ఎంపీడీఓ కె.వాణి తెలిపారు. ఏ సచివాలయం పరిధిలో పింఛనుదారులు ఆ సచివాలయానికి వెళ్లాలని, ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకూ పంపిణీ చేస్తారని తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులకు సచివాలయ సిబ్బంది ఇంటికి తీసుకువెళ్లి ఇస్తారన్నారు.

ఉన్నత విద్యతో ఉన్నతోద్యోగాలు

కొత్తపేట: ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా ఉన్నతోద్యోగాలు పొందాలని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు ఉద్బోధించారు. మంగళవారం స్థానిక డిగ్రీ కళాశాలలో 2023–24లో ఫైనల్ ఈయర్ చదువుతున్న విద్యార్థులకు ఏపీపీజీసీఈటీ పరీక్షపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల జేకేసీ విభాగం తరపున ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దిరాజు అధ్యక్షతన జరిగిన సదస్సులో పలువురు అధ్యాపకులు విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ రాజు మాట్లాడుతూ విద్యార్థులందరూ విధిగా ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. దానికి సంబంధించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసలు, అధ్యాపకులు డాక్టర్ కె.అంకమరావు, డాక్టర్ కేఎస్ఎన్, డాక్టర్ డీసీహెచ్ పాపారావు, సీహెచ్ నాగరాణి, సీహెచ్ జయశ్రీ, పి.ప్రసన్నజ్యోతి, కె.కనకరాజు, డి.కావ్య, కేఎస్ వల్లీ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కోచింగ్ సద్వినియోగం చేసుకోవాలి

కొత్తపేట: పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ ఎంట్రన్స్ ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం సూచించారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీ ఎంట్రన్స్ ఉచిత కోచింగ్ తరగతులను స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం నుంచి ప్రారంభించారు. జిల్లా కార్యదర్శి ఆదివారపుపేట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 25న ఏపీఆర్జేసీ, 27న పాలిటెక్నిక్ ఎంట్రన్స్ ఎగ్జామ్స్ జరగనున్నాయన్నారు. ఈ నెల 25 వరకూ ఉచిత కోచింగ్ తరగతులు నిర్వహిస్తామన్నారు. తొలిరోజు 45 మంది విద్యార్థులు హాజరు కాగా భౌతిక, గణితం, రసాయన శాస్త్రాలను బోధించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి ఆర్‌వీకేడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న నాయకులు

అయినవిల్లి: మండలంలోని వెలువలపల్లి అగ్నిప్రమాద బాధితులకు ఏపీఎస్డబ్ల్యూఏ ఆధ్వర్యంలో నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఇటీవల వెలువలపల్లికి చెందిన బూల కృష్ణమూర్తి తాటాకిల్లు దగ్ధమై సర్వం కోల్పోయాడు. ఆయన కుటుంబానికి జిల్లా ప్రధాన కార్యదర్శి గోసంగి బంగార్రాజు, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ నేరెడిమిల్లి సత్యనారాయణ, ఏపీఎస్డబ్ల్యూఏ మాజీ అధ్యక్షుడు జనిపెళ్ల బీమారావు, సభ్యులు వార సునీల్ కుమార్, ఈవీవీ సత్యనారాయణ, కుసుమ సురేష్, గుమ్మడి వెంకట్ సమకూర్చిన నిధులతో నిత్యావసరాలు అందజేశారు.

నేడు చంద్రబాబు రావులపాలెం రాక

రావులపాలెం: ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రజాగళం పేరుతో నిర్వహిస్తున్న ప్రచారంలో భాగంగా బుధవారం రావులపాలెంలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారని ఆ పార్టీ శ్రేణులు తెలిపారు. హెలికాప్టర్లో రావులపాలెం చేరుకుని అక్కడి నుంచి రోడ్డు మార్గంలో స్థానిక అమలాపురం రోడ్‌లో ఉన్న పార్టీ కార్యాలయం వద్దకు చేరుకుని సాయంత్రం నాలుగు గంటలకు అక్కడ జరిగే బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. అనంతరం అక్కడ నుంచి రామచంద్రపురం నియోజవర్గంలో జరిగే బహిరంగ సభకు బయలుదేరి వెళ్తారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.